# వృక్షాలు

భవాని



పనులన్నీ పూర్తి చేసుకుని వంట గది తలుపులు దగ్గరగా వేసి ముందు గదిలోకి వచ్చి వాచీ చూసింది జానకి.

'తొమ్మిది దాటినా ఇంకా ఇంటికి రాలే దీయన' అనుకుంది నిట్టూరుస్తూ.

బయట చల్లగాలి వీస్తూంది.

నాలుగో క్లాసు చదువుతున్న పెద్ద పిల్ల పుస్తకం ముందేసుకుని కునికి పాట్లు పడుతూంది.

నేలమీద చాప పరిచి అడ్డంగా రెండు బొంతలు వేసింది జానకి. మంచం మీద నిద్రపోతున్న చిన్నిగాణ్ణి తీసి కింది పక్కమీద పడుకోబెట్టింది. పెద్ద పిల్లని పడుకోమని చెప్పి, తను మంచం మీద నడుం వాల్చింది. ఆ రోజుకి పని పూర్తయినట్టే. భర్త వస్తే ఇద్దరూ భోజనం చెయ్యడమే తరువాయి. చెయ్య డానికి ఓపిక ఉండాలే కాని, ఇంట్లో పనులు అలా ఉంటూనే ఉంటాయి, ఒకదాని తరవాత మరొకటి.

రెండు రోజుల్నించీ చిన్నికి జ్వరం కాస్తూంది. డాక్టరుకి చూపించమంటే, 'అఁ, ఈ మాత్రానికి డాక్టర్లెందుకు?' అని కొట్టి పారేశాడు ప్రకాశం, జానకి భర్త. పోనీ, ఏమైనా టాబ్లెట్స్ తెమ్మంటే సరేనన్నాడే గాని తేలేదు. ప్రొద్దున్నవగా ఇల్లు వదిలి వెళ్ళిన మనిషి ఏ అర్ధరాత్రికో అపరాత్రికో కాని తిరిగి రాడు. గడప దాటిన తరవాత ఇంటి ధ్యాసే ఉండదు.

పిల్లల క్షేమం ఆటూ ఇటూ అయినా విలవిల్లాడిపోతుంది జానకి.

మిన్ను విరిగి మీద పడిపోతూందన్నా కొన్నంతైనా చలించడు ప్రకాశం. దున్నపోతు మీద వాన కురిసినట్టే ఉంటాడు.

కొత్తగా జానకిని మరో బెడద వచ్చి పట్టుకుంది. వారంలో మూడుసార్లైనా

ప్రకాశం తాగి వస్తున్నాడు. మూడు నాలుగు నెలల క్రిందట మొట్టమొదటి సారి భర్త తూలుతూ వచ్చినప్పుడు జానకి ఎంతో భయపడింది.

"స్నేహితులు బలవంతం చేస్తే తాగాను ... పిచ్చిది, ఏం బాగోలే దసలు. జనం ఎలా తాగుతారో ఆశ్చర్యం వేస్తుంది. ఇంకెప్పుడూ తాకనులే" అన్నాడు ప్రకాశం ఆ రోజు, ఏడుస్తున్న జానకితో.

ఆ మాటలు వట్టి మాటలుగానే మిగిలిపోయాయి. ప్రకాశానికి తాగటం అలవాటైనకొద్దీ జానకికి మైకంలో ఉన్న భర్త ఇంటికి రాగానే తలుపు తెరవటం మామూలైంది.

చిన్ని నిద్రలో కదిలాడు.

జానకి ఉలికిపడి లేచి వచ్చి కొడుకు నుదురు మీద చెయ్యి వేసి చూసింది.

'జ్వరం అలాగే ఉంది... రేపైనా మందు వేయించాలి...ఛీ! ఏం పట్టించుకోరు...' తన నిస్సహాయతకి కళ్లనీళ్ల పర్యంతం అయింది.

దేన్నీ పట్టించుకోకపోవడం ప్రకాశంలో జానకి కొత్తగా చూస్తున్న గుణమేం కాదు. దాదాపు పదేళ్ల క్రితం వాళ్లిద్దరికీ పెళ్లయింది. అప్పటినుంచి అలాగే ఉన్నాడతను.

"వా డెప్పుడూ అంతేనమ్మా ... నిమ్మకు నీరెత్తినట్టుంటాడు. ఎలాగో ఓలాగు వాడి మట్టుకు వాడికి కావలసిన వన్నీ జరుగుతూంటే చాలు. మిగతా వాళ్లెలా ఏడ్చినా వాడి కక్కర్లేదు... ఇక వాడు మారడు. మన ఖర్మ, అంతే" అన్నారు ముసలాయన, జానకి మామ గారు వాళ్ల పెళ్లయిన కొన్నాళ్లకి.

అలాంటి మాటలు తను వినడం అదే మొదటిసారి. తన భర్త గురించి అలా విని చాలా బాధపడింది.

రాను రాను అటూ ఇటూ చాలా మంది అదే అభిప్రాయాన్ని తలా ఒక రకంగానూ అనడం, తను వినడం, తిరిగి భర్తని సమర్థించుకోలేక ఊరుకోవడం జరిగింది.

తడిగుడ్డతో గొంతులు కోసేటంత దుర్మార్గుడు కాదు ప్రకాశం. తను, తన సుఖం తప్ప లోకంలో ఇంకొకటి అతనికి కనిపించదు. బాధ్యత, ధర్మం, కర్తవ్యం — ఇలాంటి పదాలంటే అతనికి గిట్టవు. వాటికి చాలా దూరంగా ఉంటాడు.

ప్రకాశం చాలా రకాలుగా స్వార్థ పరుడు. అతని స్వార్థం తనకు కావ వాళ్ళ కన్న అయిన వాళ్లకే ఎక్కువ చెడుపు చేస్తుంది. అంతదూరం ఆలోచించడు ప్రకాశం. అసలు ఆలోచనలు అతని ఒంటికి సరిపడవు. తన అవసరాలకి



అల్లిక సోయగం

చిత్రం— బి. ఎల్. రామాంజనేయులు (గుంటకల్లు)

సరిపడే టంతకన్న తన వాళ్లమీద ఎక్కువ ప్రేమానురాగాలు లే వతనిలో.

ఉద్యోగమూ లేక, చదువూ చదవక బి. ఎ. ఫెయిలై జులాయిగా తిరిగే అతనికి పెళ్లి చేశారు జానకి మామగారు, బాగుపడతాడేమోననే ఆశతో. కొడుకు ఏదైనా ఉద్యోగం చూసుకుంటే బాగుండునని ఉంది ఆయనకి. కన్న వాళ్లకు సాయం మాట అలా ఉంచి, తన కాళ్ల మీద తను నిలబడితే చాలను కున్నారు. ఉద్యోగాలకు ప్రయత్నించ మని చాలాసార్లు చెప్పి చూశారు.

ప్రకాశం వినీ విననట్లు ఊరుకున్నాడు.

పెళ్లయిన తరవాతనైనా తన సంసారం అంటూ ఒకటి ఏర్పడితే బాధ్యత తల కెక్కుతుందేమో ననుకుంటే అదీ జరగలేదు. పెళ్లయిన సంవత్సరానికి ఆడపిల్ల పుట్టింది. పురుటికని పుట్టింటికి వచ్చిన జానకి అప్పుడప్పుడు చుట్టపు చూపుగా తప్పితే ఇక అత్తవారింటికి వెళ్లలేదు. ప్రకాశం ఎప్పుడూ తీసుకు వెళ్లటమనే ఊసే ఎత్తలేదు. తనకై తానుగా జానకి వెళ్లినా, పది రోజుల తరవాత తిరిగి పుట్టింట్లో దిగవిడిచి వెళ్లేవాడు. జానకికి ఆ రోజులు తలుచు కోవట మంటేనే భయం.

"నే నిక్కడే ఉంటానండీ" అనేది నెమ్మదిగా, తనని పుట్టింటికి తీసుకు వెళ్లబోయే భర్తతో.

ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాననీ, ఊళ్ళు తిరగాలనీ అదీ ఇదీ చెప్పేవాడు; రైలెక్కించే వాడు—

"ఉద్యోగాలు దొరకడం ఎంత కష్టంగా ఉంది ఈ రోజుల్లో! భగీరథ యత్నం చెయ్యాలి ... మనకోసం వెతుక్కుంటూ రమ్మంటే ఉద్యోగం వస్తుందా?" — జానకి తండ్రి.

"ఏమమ్మా! ప్రకాశానికి ఆ మధ్య రాసిన లెటర్లో ఒక ఖాళీ గురించి ప్రకటన పంపాను ... దాని గురించి ఏమైనా చెప్పాడా?" జానకి తన ఎదుటబడితే అడిగేవారు ఆయన.

"అన్నీ చేతాయట, నాన్నా ..."

ఆ రోజుల్లో ఇలాంటి అబద్ధాలు ఎన్నో.

సిగ్గుతో, అవమానంతో, బాధతో తను సగం చచ్చి మాట్లాడేది భర్త ఉద్యోగం ప్రసక్తి వచ్చినప్పుడు.

జానకి పుట్టింట్లో ఒక ఆవుదూడ ఉండేది. బలంగా, ఎత్తుగా, చూడ ముచ్చటగా ఉండేది. జాతి దూడ అనీ, ఇంట్లో పుట్టిందనీ ఎంతో మమకారంతో పెంచారు. నాలుగే ళ్లొచ్చేసరికి బాగా బలిసి ఆబోతల్లే ఉండేది. చూలుతో ఉందనీ, కొద్ది నెలల్లో ఈనుతుందనీ అనుకోవడం, నెలలు గడిచినా అది అలాగే ఉండటం చాలా సార్లు జరిగింది. దాన్ని చూస్తూ ఆశా నిరాశల మధ్య ఊగులాడేది జానకి తల్లి.

"వదినా! మీ ఆవు ఎప్పు డీను తుందో!" తమ పక్కింటావిడ ఒక రోజు అడిగితే—"ఆఁ ... ఈనేటట్టే ఉంది... మేత దండుగ ... మా అల్లుడు ఉద్యోగం చెయ్యడం, ఇది ఈనడం ఒక్కలాగే ఉన్నాయి. అస లిది చూలుందో, లేదో అనుమానం" అని తల్లి అనడం తను వింది.

తనకి వినపడాలనే తల్లి అలా అన్నా అని ఉండవచ్చు.

బాధ్యత లెక్కువా, లేమి వల్ల సుఖ సంతోషాలు తక్కువా అయిన కుటుం బాల్లో ఆప్యాయతలూ, అనురాగాలూ ఉండవని కాదు. పరిస్థితుల ఒత్తిడివల్ల ఒక్కొక్కప్పుడు కన్న వాళ్లకే పిల్లలు బరువనిపిస్తారు.

'దూరంగా ఉంటేనే మర్యాద' అను కుంది తను, బాధగా.

ఆ బాధని ఏ వ్యక్తీ మాపలేదు, ఒక్క ప్రకాశం తప్ప.

అత నాపని చెయ్యడు. చెయ్యాలని అన లతని కనిపించదు.

"ను వ్వతనికి చెప్పవేమే?" అని తన నడిగేది తల్లి.

తనింకెలా చెబుతుంది? అసలు తను చెప్పాలా ఆ సంగతి?

అయినా, ఒకరు చెపితే చేసే మనిషి ప్రకాశం?

అక్కడికీ తెగించి ఒకటి రెండు సార్లంది — "ఇంకెన్నాళ్లిలా మీ రక్కడ, నే నిక్కడ ఉంటాం? నాకేం బాగాలేదు... ఉద్యోగం చూసుకుని వేరే పోదాం, పదండి" అని.

"సరేలే" అనేవాడు, అంతే.

బరువుగా, బాధగా గడిచాయి ఆ రోజులన్నీ.

అందుకే తన తండ్రి ప్రకాశం కోసం ఒక ఉద్యోగం సంపాదించానంటూ చెప్పే సరికి అందరికంటె జానకి ఎక్కువగా సంతోషించింది.

నానా అవస్థలూ పడి తనకు తెలిసిన వాళ్ల ద్వారా ఒక ప్రైవేట్ కంపెనీలో ప్రకాశాన్ని కుదిర్చా రాయన. రెండేళ్ళయింది ప్రకాశం ఈ ఉద్యోగం చేస్తూ.

చిన్ని మళ్ళీ కదలడంతో మగతలోంచి మేలుకుంది జానకి.

అర్ధరాత్రి కావస్తోంది.

* * *

ప్రకాశం తలుపు తట్టాడు.

"ఇంకా నిద్ర పోలేదూ నువ్వు?" అన్నాడు, చప్పుడు వినగానే లేచి వచ్చి తలుపు తీసిన జానకితో.

తాగి వచ్చిన రోజు మామూలుకంటె కాస్త బాగానే మాట్లాడతాడు.

తలుపు గడియవేసి లోపలికి వచ్చింది జానకి.

ప్రకాశం మంచం మీద అడ్డంగా పడుకుని ఇంటి కప్పుకేసి చూస్తున్నాడు. మంచం పట్టీ దాటి వచ్చిన కాళ్లకు చెప్పులు వేళ్లాడుతున్నాయి. జుట్టులోకి కుడిచేతి వేళ్లు పోనిచ్చి దువ్వుకుంటున్నాడు.

పంచ అందిస్తూ, "భోజనానికి లేవండి" అంది జానకి.

"నా కట్టే ఆకలిగా లేదు. నువ్వు పోయి తిను."

ఎంత ఆలస్యంగా వచ్చినా తనకోసం భార్య అన్నం తినకుండా కూర్చుంటుందని తెలుసు.

"ఎంత తినాలనిపిస్తే అంతే తిందురు గాని, లేవండి. వడ్డించేస్తున్నాను." వంటింట్లోకి నడిచింది జానకి.

ప్రకాశం తూలుతూ లేచాడు.

భర్తకి వడ్డించి తన కంచంలో అన్నం పెట్టుకుంటూ, "చిన్నికి జ్వరం తగ్గలేదు" అంది.

"... ..."

భర్త మొహంలోకి చూసింది జానకి.

ప్రకాశం పళ్లెంకేసి చూస్తూ అన్నం తింటున్నాడు.

"విమ్మల్నే!"

"ఊఁ?" తల ఎత్తి భార్యకేసి చూశాడు.

"టాబ్లెట్స్ ఏమైనా తెచ్చారా?"

"ఉహూఁ ... లేవు ..."

"అంతేలెండి ... మూడు రోజుల్నుంచి చెప్తున్నా మీకు గుర్తుండదు. ఇంట్లో పెళ్లాం, పిల్లలు ఏమై పోయారో అనే ధ్యాసే ఉండదు మీకు" అనాలను కుంది. కోసం కన్న దుఃఖం ముందొచ్చి గొంతు పూడుకుపోయింది.

ప్రకాశం చెయ్యి కడుక్కుని లేచి వెళ్లిపోతున్నాడు.

కంచాలూ, పీటలూ తీసి శుభ్రంచేసి జానకి వచ్చేసరికి ప్రకాశం నిద్రలోకి అప్పుడే జారుతున్నాడు.

కింద పడి ఉన్న షర్టు, పాంటు తీసి వంకీకి పెట్టబోతూ జేబులు చూసింది జానకి. ఏవో ఒకటి రెండు కాగితాలున్నాయి తప్ప డబ్బేం లేదు.

"ఏమండీ!" గోడవైపు తల తిప్పి పడుకున్న ప్రకాశాన్ని తట్టి లేపింది.

"ఏమండీ!"

"ఊఁ..." మత్తుగా, బద్ధకంగా ఇటువైపు తిరిగాడు.

"మీ దగ్గర డబ్బు ఖర్చై పోయిందా?"

"ఆఁ..."

"రే పెక్కడైనా అడిగి ఎదుటు తీసుకురండి."

"ప్చ్!" లాభం లేదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

"పోనీ, మీ యజమాని నడిగితే?"

జీతంలోది నెల తిరక్కుండానే కొంత ముందు వాడేస్తూ ఉంటాడు ప్రకాశం. జీతం ఇచ్చేటప్పుడు అది కోసుకుని మిగతాది ఇస్తాడు సేఠ్ గోకుల్‌దాస్‌జీ, ప్రకాశాన్ని పనిలో పెట్టుకున్న వ్యక్తి.

"ఇవ్వడు." జానకి మాటని సగం లోనే ఆపేశాడు ప్రకాశం.

"ఏం?"

"ఇవ్వడని చెప్పాను... అంతే."

"మీ రప్పుడే కొంత వాడుకున్నారా?"

"... ..."

"జీతం ఇచ్చి పది రోజులేగా అయింది?"

కళ్లు తెరిచి భార్యవేపు చూస్తూ అన్నాడు ప్రకాశం:

"ఇప్పుడు కాదు... ఎప్పుడో ... జీతంలో వాడుకోవడం కాదు... రెండు వేలు ... అప్పుడు కొంత, ఇప్పుడు కొంత లలా ఖర్చయిపోయింది...."

జానకి అచేతనంగా వింటూంది.

"నన్ను పనిలోంచి తీసేశా డీ వేళ నించి ..."

"... ..."

"అమ్మా ..." అస్పష్టంగా ఏదో కలవరించాడు చిన్ని.


ప్రకాశం మళ్ళీ గోడవైపు తిరిగాడు.

జానకికి ఏం అనాలో తోచలేదు. ఆమె ఆలోచనా శక్తి పనిచెయ్యడం మానేసింది. నవ నాడులూ క్రుంగిపోయాయా అన్నట్లుంది. అలా ఒరిగి తిరిగిన భర్తని చూస్తూ ఉండిపోయింది.

కొన్ని క్షణాల తరవాత — "రెండు వేల రూపాయలు...ఉద్యోగం పోయింది." అస్పష్టంగా గొణుగుతున్నట్లు అంది. ఆమె ఎదుట అందరూ నిలబడి నవ్వుతున్నట్లు అనిపించింది.

భవిష్యత్తు "నా పేరేమిటి?" అని అడుగుతూంది.

అంతా చిందరవందర. పగిలిన గాజు ఎలక.



ఓ పూవు పూసింది

ఫోటో — పి. రాజేశ్వరరావు (గుంటూరు)

జానకి కళ్ల వెంట ధారగా నీరు కారుతూంది.

చిన్ని మళ్ళీ కలవరించాడు.

లేచి కళ్లు తుడుచుకుని మంచినీళ్లు తెచ్చి చిన్నిని ఒడిలోకి తీసుకుంది. నిద్రలోనే రెండు గుక్కలు తాగి మళ్ళీ తల్లి ఒడిలో వాలిపోయాడు చిన్ని. దిండు వాడికి సర్ది పడుకోబెట్టింది. దుప్పటి కప్పి జోకొడుతూంటే దుఃఖం మళ్ళీ ఉప్పెనలా ముంచుకొచ్చింది.

'ఇంకా ఎప్పుడు బాధ్యత తెలుస్తుంది మీకు?' అని అడగాలనుకుంది.

భర్త అప్రయోజకత్వాన్ని గురించి ఎన్నో మాటలు వింది. ఎన్నో అవమానాలు సహించింది! ఆ రోజులు అయిపోయాయనుకుని సంతోషించింది. జీతం చాలినా, చాలకపోయినా అదే పదివేలు అనుకుంది. గుట్టుగా సంసారం నెట్టుకువస్తూంది.

ఇప్పు డేం చెయ్యాలి?

జీతం రాకముందే భర్త డబ్బు వాడుకున్నా, ఖర్చులకి చాలకపోయినా తను ఎప్పుడూ ఎందుకు వాడుకున్నారని గానీ, ఇంకా తెమ్మని గానీ అడగన్నైనా అడగలేదు. ఏదో ఒక ఉద్యోగం. ఎంతో కొంత జీతం. కుదురుగా భర్త పనిచేస్తే అంతే చాలనుకుంది.

'ఈ సంసారం ఏం కావాలి? ఈ పిల్లల్ల్దరి గతి ఏమిటి?' తనలో తనే వాపోయింది జానకి.

పిల్లల భవిష్యత్తు తలుచుకునేసరికి ఒక్కసారి భయం, ఆవేదన కలిగాయి.

వాళ్లను చూసుకునే తను అన్ని చికాకులూ భరించింది. వాళ్లకోసమే బ్రతుకుతూంది.

వాళ్ల జీవితాలు కాలం కాలి కింది ఎండుటాకులు కాకూడదు. అది తను భరించలేదు.

"ఏమండీ!" ఏదో చెప్పాలని పిలిచింది.

ప్రకాశం మంచి నిద్రలో ఉన్నాడు.

ఆ రాత్రంతా జానకికి నిద్ర పట్టలేదు.

* * *

సేఠ్ గోకుల్‌దాస్ పెద్ద వ్యాపారస్థుడనటం ఆయన్ని కించపరచటమే అవుతుంది. అతనికి ఊళ్లో రెండు సినిమా థియేటర్లున్నాయి. భార్య పేర మందుల తయారీ కంపెనీ ఉంది. కొడుకు పేరిట ఒక రైస్ మిల్లుంది. అతని బంగళా ముందర నాలుగు కార్లున్నాయి. ప్రకాశం లాంటి చాలా మంది పనివాళ్లు అతని ఆస్తిని రోజు రోజుకూ కాపాడుతూ పెంచుతూ ఉంటారు.

"సేఠ్‌జీ ఉన్నారా?" భయం భయంగా అడిగింది జానకి.

ఒకసారి పైనించి కిందదాకా చూసి గూర్ఖా గేటు తీసి 'వెళ్ళ'మన్నట్టు చెయ్యి లోపలికి చూపించాడు.

బాటకి అటూ ఇటూ ఉన్న పూల చెట్లకేసి చూస్తూ అడుగులో అడు గేస్తూ నడుస్తూంది జానకి —"ఇదంతా వేరే లోకం" అనే నిజం లాంటి భ్రమలో.

బంగళా లోపలికి అడుగు వేస్తూంటే ఆమె కాళ్ళు వణికాయి. మనసులో నిండి ఉన్న భావాలు, చుట్టూ ఉన్న వాతా వరణపు కొత్తదనం ముఖంలో తత్తర పాటు రూపంలో తొణుకుతున్నాయి. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"ఎవరు కావాలమ్మా?"

ఉలికిపడి చూసింది.

"సేఠ్ జీ?"

"ఆ గదిలో ఉన్నారు. ఇటునుంచి మెట్లెక్కి వెళ్ళండి."

హాలులో వేల, మేడమెట్లు—అంతా తివాసీల మయం.

గదిలో అడుగు పెట్టి ద్వారం దగ్గరే నిలుచుండిపోయింది జానకి. ఆమె వెనక తలుపు నెమ్మదిగా చప్పుడు చెయ్యకుండా మూసుకుంది. అంత విశాలంగానూ గదిలో ఎయిర్-కండిషనర్ పనిచేస్తూంది. పైట చుట్టూ లాక్కుంది జానకి.

ఎదురుగా ఒక గోడకి పెద్ద ఐరన్ సేఫ్ అమర్చి ఉంది దానిపైన ఒక పక్కగా రాధాకృష్ణుల పటం, ఇంకొక పక్క లక్ష్మీదేవి పటం ఉన్నాయి కిటికీ లకి నీలం తెరలు. గదికి ఒక మూలకు ఎత్తుగా బీరువా ఒకటి. గదికి మధ్యగా పెద్ద సోఫాసెట్.

ఐరన్ సేఫ్ ఉన్న గోడకు ఆనుకుని కొంచెం ఎత్తుగా పెద్ద అరుగు. దాని మీద ఒత్తుగా పరుపులూ, వాటి పైన మెత్తని దిండ్లూ.

వాటి మధ్య కూర్చుని ఏవో ఫైల్సు చూస్తున్నాడు సేఠ్ గోకుల్‌దాస్‌జీ. తెల్లటి ధోవతి, సిల్కు లాల్చీ. పెన్ను పట్టుకున్న చేతి వేళ్ళకి ఉన్న ఉంగరాలు దీపాల వెలుగులో మెరుస్తున్నాయి. ఒంటి రంగు తొడుగుకున్న చొక్కా క్రీమ్ కలర్‌తో పోటీపడుతూంది.

గదిలో చందనం వాసన వేస్తూంది.

ఒకసారి తల ఎత్తి చూసిన సేఠ్ జీ మళ్ళీ వెంటనే తల ఎత్తి ఈ సారి విచా వంగా చూశాడు. నమస్కారం చేసింది జానకి.

"ఎవరు మీరు?" తలఆడిస్తూ ఫైలు మూస్తూ అడిగాడు.

తను ఎప్పుడూ చూడని ఈ వ్యక్తి మీద కొండంత ఆశతో వచ్చింది జానకి. అతనితో ఎన్నో చెప్పాలనుకుంది. తీరా



బ్రతుకు బరువు

ఫోటో-- ఎస్. ఎస్. రావు (దర్గామిట్ట)

ఎదుట నిలబడేసరికి ఆమెకు మాటలే కరువైనాయి.

'ఇతను తలుచుకుంటే నా కాపురాన్ని నిలబెట్ట గలడ'నే భావనతో ఆమె కంటికి సేఠ్ జీ మానవాతీతుడిలా కనిపించాడు.

"నేను . " గొంతు సర్దుకుంది... "ప్రకాశం గారి భార్యని. ఆయన మీ దగ్గర పని ..." మాట మధ్యలోనే ఆగి పోయింది. బిగబట్టిన దుఃఖం తన్నుకు వస్తూంది.

సేఠ్ జీ ప్రశ్నార్థకంగా చూశాడు. మళ్ళీ తల ఆడించాడు, 'అర్థం అయిం' దన్నట్టు.

"ప్రకాశాన్ని పనిలోంచి తీసేశాను..." 'తెలిసిందా?' అన్నట్టు చూశాడు.

"... ..."

"కంపెనీకి బకాయి ఉన్న సొమ్ము కట్టక పోతే పోలీస్‌కి రిపోర్ట్ చెయ్యాలి..."

'అయిపోయిం' దన్నట్టు పక్కనే ఉన్న మరో ఫైలు తెరిచాడు.

జానకిలో ఆశ కొడిగట్టుతూంది.

నెమ్మదిగా నడిచి సేఠ్ కెదురుగా ఉన్న ఫైలు మీద మూసి ఉన్న తన గుప్పిట తెరిచింది.

రెండు పేటల గొలుసు, పుస్తెల తాడు సేఠ్ జీ కేసి చూశాయి.

"కొంత బాకీ కింద ... అవి కట్టు కోండి... మిగిలింది ఆయన జీతంలో..."

సేఠ్ జీ చిన్నగా నవ్వాడు.

"మాకు ఈ ఉద్యోగమే ఆధారం... పిల్లలిద్దరూ చిన్నవాళ్ళు ... వాళ్ళకి అన్యాయం చెయ్యకండి ..." మాటలూ, ఎక్కిళ్ళూ ఆగి ఆగి వస్తున్నాయి. పెదవు లకి నీరు ఉప్పగా తగిలింది.

చీర చెరగులో ముఖం దాచుకుని ఏడుస్తూంది జానకి.

సేఠ్ గోకుల్‌దాస్ నగలకేసి ఒకసారి చూసి వాటిని పక్కకు పెట్టి ఫైల్‌లో పేజీ తిప్పాడు.

"... ..."

కొంత బరువు కరిగిపోయింది జానకికి. సంబాళించుకుని ముఖం తుడుచుకుంది.

"కూర్చో" సుచారంగా మునివేళ్ళతో నుదురు రాసుకుంటూ ఎదుట ఉన్న సోఫాకేసి తల ఆడించాడు.

జానకి కూర్చోలేదు. తల వాల్చుకుని నేలమీద తివాసీని చూస్తూ నిలుచుంది.

మనసు అంతంగా కొట్టుకుంటూంది.

సేఠ్ జీ అలా చూస్తూ ఉండి పోయాడు.

'ప్రకాశాన్ని పనిలోంచి తీసేయటం కన్న ఉంచితేనే బాగుంటుంది' అనిపిం చింది. పెన్ పక్కన పెట్టి గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు తీసి పెన్ పక్కనే పెట్టాడు. జానకి ఉంచిన నగలు అరచేతిలో పట్టు కుని లేచాడు. వాటిని చూస్తూ మళ్ళీ జానకికేసి చూశాడు.

జానకి అందం నగలకన్న ఎక్కువగా మెరుస్తూంది సేఠ్ కళ్ళలో.

ఆమె దగ్గరికి నడిచాడు.

జానకి తల ఎత్తి చూసింది.

"ఇవి ... అవసరం లేదు... తీసుకో." మాటలు తడబడ్డాయి.

"ఎందుకు . . ." విస్మయంగా చూసింది జానకి.

సేఠ్ జీ కళ్ళు కోరిక లేపిన రంగులో కెంపుల్లా మెరుస్తున్నాయి... నుదుటి పైన చెమట పడుతూంది.

ఒక అడుగు ముందుకు వేసింది...

అతడికి మైకం కమ్మినట్లయింది. నరాలు వణకసాగాయి...

"ఉంచుకో ... ఫర్వాలేదు... వసలోకి తీసుకుంటాను. భయపడకు ..." ఒక అడుగు ముందుకు వేసి జానకి చెయ్యి పట్టుకున్నాడు.

మాటలోంచి వస్తున్నట్టున్నాయి మాటలు.

నోరు నవ్వుతూంది.

"ఛీ ..." తుళ్ళిపడి పురుగుని విది లించినట్టు మీద పడిన చేతిని తోసేసి పడుతూ లేస్తూ బయటికి పరుగు తీసింది జానకి, తను ఊహించని ఈ పరిణామానికి తత్తరపడుతూ.

"ఇదిగో!" సేఠ్ గోకుల్‌దాస్ పిలు స్తున్నాడు.

రోడ్డు మీదికి వచ్చేసరికి కొన్ని యుగాలు గడిచినట్లయింది జానకికి. కొంచెం దూరం నడిచి ఆగి ఆయాస తీర్చుకుంది.

"ఛీ!" అంటుంది మళ్ళీ సేఠ్ ఇంకా ఎదురుగా నిలబడి నవ్వుతున్నట్టే ఉంది.

నుదుటి మీదికి జారిన వెంట్రుకలు వెనక్కి తోసుకుంటూ ఇంటివేపు నడిచింది. . .

భర్త ఉద్యోగం ... పిల్లల భవిష్యత్తు. ఇవన్నీ ఎన్నో రోజుల క్రిందటి విషయా ల్లాగా తోచాయి.

బాగా చీకటి పడింది.

• • •

ఇల్లు చేరుకున్న జానకికి కూతురు తలుపు తీసింది.

చిన్ని నిద్రపోతున్నాడు. జ్వరం అలాగే ఉంది.

కొడుకు పక్కనే నీరసంగా కూలబడింది జానకి.

"నాన్న ఈ కాగితం నీ కిమ్మన్నా రమ్మా."

"... ... ?"

వణుకుతున్న చేత్తో కూతురి చేతిలో ఉత్తరం తీసుకుంది జానకి.

"జానకీ —

నే నెక్కడికి వెళ్తానో తెలుసు ఎందుకు వెళ్తానో కూడా తెలుసు.

ఎన్నో రోజులనుండి పనిలోంచి తన్ను న్నాడు కదూ? జానకీ! నా కా ఉద్యోగమూ వద్దు, ఆ ఉద్యోగాన్ని పోకుండా చేయడం కోసం వెళ్ళిన నువ్వూ వద్దు.'

ప్రకాశం." ★